క్లుప్తంగా

ఇంటింటా క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే



క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కరప: మండల పరిధిలోని పలు గ్రామాల్లో క్యాన్సర్‌ను గుర్తించేందుకు ఎన్‌సీడీసీడీ (క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే) ఇంటింట సర్వే నిర్వహిస్తున్నట్టు కరప పీహెచ్‌సీ డాక్టర్ వి.ఎం జిలిన్ తెలిపారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులందరికీ బీపీ, షుగర్, హెచ్‌బీ తదితర పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఎన్‌సీడీసీడీ ఇంటింటి సర్వేలో భాగంగా ఏఎన్ఎంలు సాదే ఉషా కుమారి, జి.రత్నకుమారి, ఆశా కార్యకర్త వైవీ అనంతలక్ష్మి శనివారం కరపలో ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు నమోదుచేసి, పరీక్షలు నిర్వహించారు. ఫోన్‌నంబర్ ద్వారా వచ్చిన ఓటీపీ నమోదుతో సంబంధిత కటుంబ సభ్యుల సర్వే నిర్వహించారు.

వైడీ రామారావుకు సత్కారం

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ చైర్మన్, రెడ్‌క్రాస్ జాతీయ కార్యవర్గ సభ్యుడు, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావును ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీగా ఎన్నికైన పేరాబత్తుల రాజశేఖర్ శనివారం ఘనంగా సత్కరించారు. సిద్ధార్థనగర్‌లోని రామారావు నివాసంలో ఆయన ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని శ్రీరామచంద్రమూర్తి దేవస్థానంలో నూతన ధ్వజ స్థంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, ప్రతిష్ఠా సంకల్పం, పంచగవ్య ప్రాసన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 10న ఉదయం 9.20కి రజిత ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పైండా రామకృష్ణారావు తెలిపారు.

రేపు కుమారస్వామి కల్యాణోత్సవం

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయంవీధిలోని బాలత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న వల్లీదేవసేన సమేత కుమారస్వామి వార్షిక కల్యాణోత్సవం సోమవారం రాత్రి 7. 30 గంటలకు జరుగుతుందని ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు శనివారం విలేకర్లకు తెలిపారు. ఈ నెల 12న సదస్యం, 15న శ్రీపుష్పయాగం నిర్వహించనున్నట్టు తెలిపారు. భక్తులు ఈ కల్యాణ మహోత్సవంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

రెండు రోజుల్లో భవన నిర్మాణ అనుమతులు



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నారాయణ

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): భవన నిర్మాణాలకు దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లో అనుమతులు ఇవ్వాలని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి.నారాయణ అధికారులకు సూచించారు. కాకినాడ నగరపాలక సంస్థ, కౌడా అధికారులతో శనివారం సంస్థ కార్యాలయంలో సమీక్షించారు. కలెక్టర్ షణ్మోహన్, సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, కమిషనర్ భావనలతో కలిసి టౌన్ ప్లానింగ్ విభాగంపై సమీక్షించారు. భూ బదలాయింపులు, లేఅవుట్లు, ప్లాన్ల అనుమతులపై ఆరా తీశారు. అనంతరం రాష్ట్రస్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. టౌన్ ప్లానింగ్, కౌడా ద్వారా ఆదాయ వనరులు సమకూర్చుకోవాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ స్కీమ్‌కు పెండింగ్‌లో ఉన్న 976 దరఖాస్తులను, నగరపాలక సంస్థలో పెండింగ్‌లో ఉన్న 204 దరఖాస్తులను త్వరగా పరిశీలించాలన్నారు. ఎల్ఆర్ఎస్ స్కీమ్ గడువును ఆరు నెలలకు పెంచాలని మంత్రి సూచించారు. లేఅవుట్స్‌కు నాలుగు రోజుల్లో, బిల్డింగ్ పర్మిషన్లు రెండు రోజుల్లో ఇవ్వాలని సూచించారు.

జనసేన ఆవిర్భావ సభకు ఏర్పాట్లు

బాలాజీచెరువు (కాకినాడ): పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభ భారీ ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. శనివారం కాకినాడ కుళాయిచెరువు ప్రాంతంలోని గోదావరి కళాక్షేత్రంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి వివిధ కమిటీలకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రమణయ్యపేట పద్మానగర్‌లో కాలనీ సంక్షేమం సంఘం ఆధ్వర్యంలో మహిళలకు సన్మానం



వేళంగి పంచాయతీ కార్యాలయంలో మహిళలను సత్కరించిన ఎంపీపీ తదితరులు



మహిళలను సత్కరించిన ఎంపీజే సభ్యులు

మహిళలే మహారాణులు

- పలు కార్యక్రమాల్లో నినదించిన వక్తలు
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు

కాకినాడ రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను మండల పరిధిలో శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళలే మహారాణులుగా వారి సేవలను గుర్తించి, పలు చోట్ల సంబరాలు నిర్వహించారు. మహిళలను సన్మానించి, జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. రమణయ్యపేట ఏపీఎస్పీ బెటాలియన్ పాఠశాలలో జరిగిన వేడుకల్లో కమాండెంట్ నాగ్రేందరావు, అడిషనల్ కమాండెంట్ దేవానందరావు తదితరులు పాల్గొని మహిళలను సన్మానించి, బహుమతులు అందించారు. ఈ సందర్భంగా కమాండెంట్ నాగేంద్రరావు మాట్లాడుతూ స్త్రీలు అన్ని రంగాలలో ప్రగతి సాధిస్తున్నారన్నారు. వేదాలలో పేర్కొన్నట్టు 'యత్ర నార్యస్తు పూజ్యంతే తత్ర రమంతే దేవతా' అనేలా స్త్రీలను పూజించే చోట దేవతలు కొలువుంటారని పేర్కొన్నారు.

రమణయ్యపేట పద్మానగర్ కాలనీలో

పద్మానగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పరసా సత్యనారాయణ చేతులు మీదుగా వివిధ రంగాల మహిళలు అడబాల పార్వతి, ఇంటి సూర్యకాంతం, చింతలపూడి సరోజిని, నరసమాంబ తదితరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

రాయుడుపాలెంలో ఆశ్రయ వృద్ధుల ఆశ్రమంలో కాకినాడ ఐడీఏ ఆధ్వర్యంలో మహిళలకు దంత పరీక్షలు చేసి మల్టీ విటమిన్ మాత్రలు, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టరు అద్దాల సత్యనారాయణ మాట్లాడుతూ మహిళా దినోత్సవం కార్మిక ఉద్యమం నుంచి పుట్టిందన్నారు. దీనిని ఐక్యరాజ్య సమితి గుర్తించిందన్నారు. 1908లో తక్కువ పని గంటలు, మెరుగైన జీతం, ఓటు వేసే హక్కు కోసం 15 వేల మంది మహిళలు న్యూయార్క్ సిటీలో ప్రదర్శనలు చేయడంతో మహిళల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని అమెరికాలోని సోషలిస్టు పార్టీ 1909లో జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించిందన్నారు. దీనిని అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించాలన్న ఆలోచన క్లారా జెట్కిన్ అనే ఒక మహిళదన్నారు. ఈ మేరకు 1910లో ఆమె ప్రతిపాదన చేశారన్నారు.

పిల్లలపై వివక్ష తగదు

కరప: ఆడ, మగ అనే వివక్ష చూపకుండా పిల్లలందరినీ సమానంగా ఆదరించి, చదివించేలా తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకురావాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మహిళలు విద్యనభ్యసించి, వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. మండలం వేళంగిలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం సర్పంచ్ సవిలే నీలిమ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీలక్ష్మి మాట్లాడారు. రచయిత, సామాజికవేత్త సవిలే రాజేష్ మాట్లాడుతూ ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ముందుగా గౌతమ బుద్ధుడు, సంఘ సంస్కర్తలు మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులు, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యారంగంలో సేవలందిస్తున్న జి.సుజాత, గిడితూరి వీరవెంకట విజయలక్ష్మిలను, న్యాయవాద వృత్తిలో సేవలందిస్తున్న ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ జిల్లాఅధ్యక్షులు తప్పెట్ల పృథ్వీరాజ్ దంపతులను సవిలే ఫౌండేషన్ తరపున ఎంపీపీ శ్రీలక్ష్మి, ట్రస్ట్ ఆఫ్ బొండా చైర్మన్ డాక్టర్ బొండా వెంకన్నారావు, సర్పంచ్ నీలిమి ఘనంగా సత్కరించారు. హైస్కూలు హెచ్ఎం కాశీభారతి, వేళంగి గ్రాడ్యుయేట్ ప్రతినిధి ఎర్రా విక్రమ్, వార్డు సభ్యులు పి.దేవీశ్రీదేవి, జె.చంద్రకళ, కె.సాంబమూర్తి, పెంకే సత్తిబాబు, పి.సూర్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సత్కారం

బాలాజీచెరువు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కాకినాడ మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) కార్యాలయంలో సమాజంలో విశిష్ట సేవలు అందిస్తున్న ఐదుగురు మహిళలను సత్కరించారు. శనివారం ఎంపీజే కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎండి హలీమ్ అధ్యక్షతన పి.అనుపమ, సీహెచ్ గిరిజ, డాక్టర్ గుల్జార్ బానో షిరీ, జైబునా మొయినా, ఎం.డి.షర్మిలలను సత్కరించారు. అధ్యక్షులు ఎండీ హలీమ్ వారిని అభినందించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సుప్రీమ్ కౌన్సిల్ సభ్యులు షేక్ హుస్సేన్, ఎంపీజే సభ్యులు పాల్గొన్నారు.

బాలికల ఆత్మరక్షణకు శిక్షణ

ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాల బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆత్మ రక్షణకు శిక్షణను అందిస్తున్నట్లు జేసీఐ కాకినాడ పోర్టు ప్రెసిడెంట్ డాక్టర్ తన్మయి రామచంద్ర తెలిపారు. కాకినాడ సాంబమూర్తినగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో జేసీఐ కాకినాడ పోర్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బాలికలతో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ప్రిన్సిపాల్ మేరి సౌరమ్మ, అధ్యక్షత వహించగా ప్రెసిడెంట్ డాక్టర్ తన్మయి రామచంద్ర ముఖ్యఅతిథిగా మార్షల్ ఆర్ట్స్ ట్రైనర్ లక్ష్మణ్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న జేసీఐ కాకినాడ పోర్టు సభ్యులు, విద్యార్థినులు

తూరంగిలో..

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు సెక్టార్ అంగన్‌వాడీ ఆధ్వర్యంలో తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీలో శనివారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బేటీ పడావో, బేటీ బచావో నినాదాలతో కాలనీలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆరోగ్య సలహాదారు రాబర్ట్ రవిచంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వై.సింహాచలంలను సత్కరించారు. అనంతరం వివిధ ఆటల పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేశారు. పిల్లలు ప్రదర్శించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది.

నర్సెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో నర్సెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నర్సింగ్ సూపరింటెండెంట్ సంధ్య కేక్ కట్ చేసి నర్సులు, ఇతర మహిళా సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం అసోసియేషన్ అధ్యక్షురాలు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది.



కేట్ కట్ చేస్తున్న నర్సింగ్ సూపరింటెండెంట్ సంధ్య

డీఎంహెచ్‌వో కార్యాలయంలో..

డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ కార్యాలయంలో కేక్ కట్ చేసి మహిళా సిబ్బందికి అభినందనలు తెలిపారు. విధి నిర్వహణలో పురుషులకు మించిన ప్రతిభకనబరిచి మహిళలు తమకు సాటి లేదని నిరూపించుకుటుంన్నారన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

కాకినాడలోని ఎస్పీ కార్యాలయంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి ఎస్పీ బిందు మాధవ్ మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన వక్తృత్వ, వ్యాస రచన, చిత్రలేఖన పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

విద్యార్థినుల రక్తదానం

స్థానిక ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన 10 మంది యువతులు శనివారం గ్లాస్ హౌస్ సెంటర్‌లోని శ్రీ యువసేన బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. బ్లడ్ బ్యాంక్ వ్యవస్థాపకుడు డాక్టర్ సతీష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అంతకుముందు మహిళా దినోత్సవ కేక్ కట్ చేశారు. రక్తదాన శిబిరంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సురేఖ, కాకినాడకు చెందిన సోషల్ మీడియా ఫేం చామంతి శ్రీదేవి పాల్గొన్నారు.



ఏపీఎస్పీ బెటాలియన్‌లో మహిళలకు బహుమతులు అందజేత



విజేతలకు బహుమతులు, మెమెంటోలు ప్రదానం చేసిన ఎస్పీ బిందుమాధవ్

ఇంటామేన్ ఫౌండేషన్‌కు రూ. 50 వేల విరాళం

బోట్‌క్లబ్: నిరుపేద బాలలను దత్తత తీసుకుని వారికి ఉచితంగా చదువు చెబుతున్న ఇంటామేన్ ఫౌండేషన్‌కు ఒమేనస్ వీల్స్ వావ్ ఫౌండేషన్ రూ.50 వేల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



ఇంటామేన్ సంస్థకు రూ. 50 వేల చెక్కు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో..

స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉత్తమ మహిళా ఉద్యోగులను జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సత్కరించారు. జిల్లాలోని కాకినాడ, తుని, ఏలేశ్వరం డిపోలకు చెందిన 14 మంది ఉత్తమ ఉద్యోగులకు గుర్తించి వారి ప్రశంసా పత్రం, నగదు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ మనోహర్ పాల్గొన్నారు.

భక్తితోనే వీఐపీ హోదా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ధర్మ ప్రచారక్ రఘు

కరప: ప్రతి ఒక్కరూ అధ్యాత్మిక సాధన చేస్తే తప్పక మోక్షం సిద్ధిస్తుందని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు అన్నారు. స్థానిక నీలయ్యతోటవీధి రామాలయం వద్ద శనివారం జరిగిన సమరసత సేవా ఫౌండేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. భగవంతుడి ఎదుట డబ్బు, అధికారం ప్రదర్శించినంత మాత్రాన వీఐపీలు కాలేరన్నారు. భక్తి భావంతోనే రాముడికి రామదాసు, బాలాజీకి అన్నమయ్య, శివయ్యకు కన్నప్ప పాండురంగడికి తుకారాంలు వీఐపీలు అయ్యారన్నారు. మరణం ప్రతిక్షణం మనవెంటే ఉంటుందని, అది తెలిసి కూడా ధర్మాన్ని విడిచిపెట్టి, పాపాలు చేస్తూ మూటలు పోగేసి దేవుడు దగ్గర వీఐపీ స్థానం పొందాలనుకోవడం అమాయకత్వమే అన్నారు. అధ్యాత్మిక సాధనే మోక్షానికి దారి చూపుతుందని ఆయన వివరించారు. మండల మహిళా కన్వీనర్ పేకేటి లక్ష్మీకాంతం, సహ కన్వీనర్ నున్న అమరావతి, పేకేటి సత్యశ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామాలయ జీర్ణోద్ధరణ

- చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా విగ్రహాలకు మహాకుంభ సంప్రోక్షణ

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలో సుమారు 160 ఏళ్ల నాటి రామాలయం జీర్ణోద్ధరణ, హనుమ, లక్ష్మణ సహిత సీతారామలక్ష్మణ స్వామి వార్ల విగ్రహాలకు మహా సంప్రోక్షణ చేశారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 1856లో ప్రతిష్ఠించిన ఈ రామాలయంలో తిరిగి 1994లో చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా జీర్ణోద్ధరణ జరిగింది. తాజాగా పురాణం రామాచార్యులు, వెంకటాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కోసం మూడు రోజులుగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు శనివారం ఉదయం ప్రాతఃఆరాధన, చతుఃస్థానార్చన, గో పూజ, సుందరకాండ పారాయణం, సంక్షేప రామాయణ హవనం, మూలమంత్ర, మూర్తిమంత్ర హవనాలు, సర్వ గ్రహబాధ, నరదృష్టి నివారణకై శ్రీనారసింహ ఇష్టి, నివేదన, పూర్ణాహుతి, మంగళాశాసనం నిర్వహించారు. సాయంత్రం సర్పవరం వచ్చిన చిన్న జీయర్‌స్వామిని గ్రామంలో ఘనంగా ఊరేగించారు. తొలుత సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయాన్ని ఆయన సందర్శించి, స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం రామాలయం వద్దకు వచ్చి జీర్ణోద్ధరణ, విగ్రహాలకు మహా కుంభ సంప్రోక్షణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



రామాలయ జీర్ణోద్ధరణ, మహాకుంభ సంప్రోక్షణలో పాల్గొన్న చిన జీయర్ స్వామి

శిశువుల వైద్యానికి రూ.70 వేల 'చేయూత'

కరప: గ్రామంలో కవలలకు జన్మనిచ్చిన బుద్దాల వీరవిజయలక్ష్మి, సత్యనారాయణ దంపతులకు వైద్య ఖర్చుల నిమిత్తం చేయూత స్వచ్ఛంద సేవాసంస్థ రూ.70 వేలు ఆర్థిక సాయం అందించింది. గ్రామానికి చెందిన బుద్దాల వీరవిజయలక్ష్మికి 29 వారాలకే కవలలు జన్మించారు. నెలలు నిండకుండానే వారు జన్మించడం, సరైన బరువు లేకపోవడంతో వారికి వైద్యం చేయించే ఆర్థిక స్థోమత లేక చేయూత సంస్థను ఆశ్రయించారు. దీంతో సంస్థ ఆర్థిక కార్యదర్శి చింతా నారాయణ మూర్తి తమ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, మహ్మద్ అలీమ్‌లతో చర్చించారు. శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా ఆ కుటుంబానికి రూ.70 వేల చెక్‌ను చేయూత మహిళా విభాగం సభ్యులు డేగల లక్ష్మి, పరసా ఝాన్సీ శేషుకుమారి, మాధవి, రమాదేవి, కుమారి, ఝాన్సీలు అందజేశారు. చేయూత సంస్థ అధ్యక్ష,కార్యదర్శులు రవికుమార్, అలీమ్, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు రూ.70 వేల చెక్‌ను అందజేస్తున్న చేయూత సభ్యులు

వెల్‌కం టు 'రంగరాయ'



వివిధ ప్రదర్శనల్లో పాల్గొన్న విద్యార్థులతో ముఖ్య అతిథి డాక్టర్ నరసింహం

ఉత్సాహంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు

కాకినాడ క్రైం: స్థానిక రంగరాయ వైద్య కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంబీబీఎస్ ఫైనలియర్ విద్యార్థుల వింగ్డిడర్స్ బృందం జూనియర్లకు ఆహ్వానం పలికింది. 2024 బ్యాచ్‌కు చెందిన 250 మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి ఫ్రెషర్స్ డే వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, ఏపీ డీఎంఈ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వైద్య విద్య ఆశయం ఉన్న విద్యార్థుల జీవితాలకు కొత్త రంగునద్దుతుందని అన్నారు. ప్రాణాలను కాపాడే అరుదైన ఘనత కేవలం వైద్యుడికే ఉందని తెలిపారు. డాక్టర్ కావాలనుకోవడం విద్యార్థి అభిమతమైతే, తమ బిడ్డను డాక్టర్ చేయాలనుకోవడం ఎందరో తల్లిదండ్రుల జీవితాశయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ రంగరాయ వైద్య కళాశాలలో విద్యనభ్యసించడం ఓ అరుదైన అవకాశమన్నారు. సుమారు ఏడు దశాబ్దాలుగా కళాశాల ఎందరో వైద్యులను ప్రపంచానికి అందించిందని తెలిపారు. దేశ విదేశాల్లో స్థిరపడ్డ ఎందరో ప్రముఖ వైద్యులు రంగరాయ విద్యార్థిగా కళాశాల కీర్తిని ఇనుమడింపజేశారని కొనియాడారు. నూతనంగా వైద్య విద్యలోకి అడుగుపెడుతున్న విద్యార్థులు తమ భవితను బంగారుమయం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శశి సహా జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డాక్టర్ శ్రీనివాసన్, ఆర్ఎంసీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



విద్యార్థినుల నృత్యరూపకం

జాతీయ లోక్ అదాలత్‌లో 1527 కేసుల పరిష్కారం

కాకినాడ లీగల్: జాతీయ లోక్ అదాలత్ ద్వారా 1527 కేసులు పరిష్కారమయ్యాయని స్థానిక మూడో అదనపు జిల్లా జడ్జి, లోక్ అదాలత్ చైర్మన్ పి.కమలాదేవి తెలిపారు. స్థానిక కోర్టులో శనివారం 8 బెంచ్‌లు ఏర్పాటు చేసి లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్ 8 బెంచ్‌లకు న్యాయమూర్తులుగా నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ, ఆరో అదనపు జిల్లా జడ్జి నిఖిత, రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయబాబు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రసన్నలక్ష్మి, మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి, ఐదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ షేక్ షరీన్, స్పెషల్ మొబైల్ జ్యుడీషయల్ మేజిస్ట్రేట్ ఎస్.ఉషాలక్ష్మి కుమారి, స్పెషల్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎ.నాగమల్లేశ్వరి వ్యవహరించారు.



లోక్ అదాలత్‌ను పరిశీలిస్తున్న మూడో అదనపు జిల్లా జడ్జి, లోక్ అదాలత్ చైర్మన్ కమలాదేవి

విద్యార్థినికి రూ.1.89 లక్షల ఆర్థిక సాయం

సామర్లకోట: స్త్రీల ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచుకోవాలని డాక్టరు గుమ్మళ సౌమ్య అన్నారు. స్థానిక వైఆర్ఎల్ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళల ఆరోగ్య సమస్యలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. విద్యార్థినులలో సాధారణంగా ఉండే రక్తహీనత, హార్మోన్ల సమస్యలపై అవగాహన పెంచి ఎటువంటి పౌష్టికాహారం తీసుకోవాలో వివరించారు. కళాశాలలో డిగ్రీ చదువుతున్న ఎస్.అభినయ సోదరి ఐశ్వర్య అనారోగ్యానికి గురి కావడంతో విషయం తెలుసుకున్న విద్యార్థులు అధ్యాపకులు స్పందించారు. ఈ మేరకు వారితో పాటు, అధ్యాపకులు రూ.89,391, వైఆర్ఎల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కామేశ్వరి, శ్రీనివాసులు రూ.లక్ష వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వై.లావణ్య, కరస్పాండెంట్ వై.లక్ష్మీరాజ్యం, ఐఐటీ స్కూల్ ప్రిన్సిపాల్ మాధవి, ఏఓ ఆకుల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పొలంలోకి దూసుకువెళ్లిన టిప్పర్

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో టిప్పర్ అదుపు తప్పి పొలంలోకి దూసుకుపోయింది. స్థానికుల కథనం ప్రకారం సామర్లకోట-కాకినాడ రోడ్డులో ముత్యాలమ్మ ఆలయం సమీపంలో జాతీయ రహదారి ఫ్లైఓవర్‌కు మట్టి తీసుకువస్తున్న టిప్పర్ అదుపు తప్పి పొలంలోనికి దూసుకుపోయింది. వెంటనే డ్రైవర్ టిప్పర్ నుంచి దూకి ప్రాణాలు రక్షించుకున్నాడు. ఈ సమయంలో రోడ్డుపై వాహనాల రాకపోకలు లేకపోవడం వల్ల పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. టిప్పర్ డ్రైవర్లు 24 గంటల పాటు విధులు నిర్వహించి మరుసటి రోజు విశ్రాంతి తీసుకోవడంతో రాత్రి సమయంలో నిద్ర లేకపోవడం వలన తరుచూ టిప్పర్లకు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఇంటర్ పరీక్షకు ఏడుగురు గైర్హాజరు

కరప: మండలం వేళంగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. శనివారం జరిగిన ప్రథమ సంవత్సర పరీక్షలో 101 మంది రాయాల్సి ఉండగా 94 మంది హాజరై, ఏడుగురు గైర్హాజరైనట్టు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ అచంట అంజిబాబు తెలిపారు. మ్యాథ్స్-1బి, జువాలజీ-1, హిస్టరీ-1 సబ్జెక్టులపై పరీక్ష జరిగిందన్నారు.

స్వామిత్వ సర్వేలో శిక్షణ

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో స్వామిత్వ సర్వేపై డివిజన్ స్థాయిలో ఒక్క రోజు శిక్షణ తరగతిని శనివారం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలలో సర్వే, మ్యాపింగ్ నిమిత్తం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణను ఇచ్చారు. కార్యక్రమంలో డీపీఓ రవికుమార్, డీఎల్‌పీఓ అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో విద్యుత్ మీటర్ల దగ్ధం

పెద్దాపురం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల శనివారం పట్టణంలోని ఓ ఇంట్లో విద్యుత్ మీటర్లు దగ్ధమయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం పట్టణానికి చెందిన విలయత్ ఆలీ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. నాలుగు విద్యుత్ మీటర్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనతో భారీ శబ్దాలు, ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఇంట్లో ఉన్న పెద్దలు, పిల్లలు ఒక్కసారిగా వీధులోకి పరుగులు తీశారు. స్థానికులు ఇంటిలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వచ్చిన మంటలను నీటితో ఆర్పివేయడంతో ఊపిరిపీల్చుకున్నారు.